సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 25 । జూలై । 2024



ఈ-క్రాప్‌పై నీలినీడలు!

ఈ-క్రాప్ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇంతవరకు పంటల వివరాలు నమోదు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



బ్యాంగిల్ షాపులో అగ్నిప్రమాదం

శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి సమీపంలో బ్యాంగిల్ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.9.50 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. - 8లో

27న ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలో రెండో విడత ప్రవేశాల కోసం ఈ నెల 27న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్‌మోహనరావు తెలిపారు. డీఎల్‌టీసీలో మొదటి విడతలో భర్తీ కాగా మిగిలి ఉన్న మిగులు సీట్ల భర్తీ కోసం రెండో విడత ప్రవేశాలకు ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ వెలువరించినట్టు చెప్పారు. దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌ఫొటోలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి వ్యాయామ విద్య సదస్సులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను వ్యాయామ విద్య క్యాలెండర్ నిర్వహణకు డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్టు డీఈఓ కె.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. వ్యాయామ విద్యలో వచ్చిన నూతన పోకడలు, ఆవిష్కరణలు, విధివిధానాలు, రికార్డుల నిర్వహణ స్పోర్ట్స్ కిట్ల వినియోగంపై వ్యాయామ విద్య సదస్సుల్లో చర్చించి పీడీ, పీఈటీలకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. ముఖ్యంగా 2024-25 సంవత్సరానికిగాను స్కూల్‌గేమ్స్, గ్రిగ్స్ పోటీల మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి ఎంపికలు, పోటీలపై చర్చించడంతోపాటు ఎంపిక పోటీల నిర్వహించే పాఠశాలల వేదికలను, తేదీలను సదస్సులో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం డివిజన్, టెక్కలి డివిజన్‌ల పరిధిల్లో అన్ని యాజమాన్య ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులంతా సదస్సులకు హాజరు కావాలని కోరారు. ఆయా డివిజన్ల పరిధిలో డీవైఈఓలు, ఎంఈఓలు, పీడీ, పీఈటీలు విధిగా హాజరుకావాలని స్పష్టంచేశారు. హెచ్ఎంలు చొరవ తీసుకుని పీడీ, పీఈటీలను సదస్సులకు హాజరయ్యేలా రిలీవ్ చేయాలని సూచించారు. శ్రీకాకుళం డివిజన్ పరిధి సదస్సు ఈ నెల 25న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రూరల్ పరిధిలోని మునసబ్‌పేటలో ఉన్న గురజాడ గాయిత్రి కళాశాల వేదికగా, టెక్కలి డివిజన్ పరిధి సదస్సు ఈ నెల 26న ఉదయం 9 గంటలకు నౌపడ ఆర్ఎస్ పరిధిలో ఉన్న ప్రణవి కళాశాల వేదికగా జరగనుందని చెప్పారు.

పాగురు తవ్వారు




యంత్రాల సాయంతో పాగురు తీత పనులు చేస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పుటేరు పొంగి నువ్వలరేవు తీరం వద్ద పాగురు (ఇసుక మేట) వేయడంతో భారీగా వరద నీరు గ్రామంలోకి చేరింది. పరిసర గ్రామాల పంట పొలాలు నీట మునిగాయి. దీంతో గ్రామస్తులంతా ఏకమై బుధవారం యంత్రాల సాయంతో ఇసుక మేట తొలగించారు. ఈ పనులను కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరావు, ఎస్సై రామారావు పరిశీలించారు. ఆంధ్రా-ఒడిశాసరిహద్దు కొండలపై పడిన వరద నీరు బెండి గెడ్డ వెంబడి ఉధృతంగా ప్రవహించి ఉప్పుటేరులోకి చేరి అక్కడ నుంచి నువ్వలరేవు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుందని, ఈ సమయంలో ఇసుక కోతకు గురై తీరంలో మేట (పాగురు) వేయడంతో వరదనీరు గ్రామంలోకి చేరుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి ఉండటంతో వందలాది ఎకరాల పంట నీట మునిగిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం

అరసవల్లి: జిల్లాలో మాతృ శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ, మొబైల్ అకాడమీ సేవలు పనిచేస్తున్నాయని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. బుధవారం స్థానిక సమావేశ మందిరంలో ఆశా నోడల్ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా కిల్కారీ, మొబైల్ అకాడమీ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వాయిస్ కాల్స్‌తో మాతాశిశు ఆరోగ్యాలకు ప్రత్యేకంగా భద్రత కలుగుతుందన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు గర్భస్థ వివరాలను ఏఎన్ఎంకు తెలియజేసి వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 012444 51660 నంబర్‌తో వాయిస్ కాల్ వస్తుందని, తద్వారా భద్రతా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కిల్కారీ వాయిస్ కాల్ సేవల ద్వారా తెలుసుకునే అవకాశముంటుందన్నారు. మళ్లీ వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు, రీజనల్ ప్రోగ్రాం అధికారి ఆర్.మోహనరావు, వైద్యాధికారులు ముఖలింగం, డాక్టర్ శైలజ, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కిల్కారీ, మొబైల్ సేవల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి, అధికారులు



ఢిల్లీలో జరిగిన ధర్నాకు హాజరైన జిల్లా నాయకులు





నిరంకుశ పాలనపై నిరసన గళం

- హస్తినలో నిరసనకు తరలివెళ్లిన జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, చేస్తున్న హత్యలు, ఆస్తుల విధ్వంసంపై తీవ్రస్థాయిలో గళమెత్తారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో హింసకు పాల్పడటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని నినదించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో సిక్కోలు నాయకులు తమదైన ముద్ర వేశారు. ధర్నాలో పాల్గొన్న వారిలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, పిరియా సాయిరాజ్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ ఇన్‌చార్జి పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ రవి, ధర్మాన కృష్ణ చైతన్య, శ్యామ్‌ప్రసాద రెడ్డి, తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు ఉన్నారు.

రైల్వే బడ్జెట్‌లో రొటీన్ కేటాయింపులే..

- జిల్లాలో పాత పనులకే కొనసాగింపు నిధులు
- కనిపించని కూటమి నేతల చొరవ




సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రైల్వే బడ్జెట్‌లోనూ రొటీన్‌గా చేసిన కేటాయింపులు తప్ప జిల్లాకు ప్రత్యేకంగా ఒరిగిందేమి కన్పించలేదు. దేశ వ్యాప్తంగా రైల్వే శాఖ చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగానే కేటాయింపులు జరిగాయే తప్ప కూటమి నేతలు చొరవతో వచ్చిందేమీ లేదు. గత ఎన్డీయే ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులకు కొనసాగింపు నిధులు మాత్రమే ఈ బడ్జెట్‌లో కేటాయించినట్టు లెక్కలు చెబుతున్నాయి.

జిల్లా వరంగా కేటాయింపులిలా..

- నౌపడ నుంచి తిరువల్లి వరకు వేస్తున్న కొత్త రైల్వే లైన్‌కు సంబంధించి గుణుపూర్ వరకు రూ.50 కోట్లు కేటాయించింది.
- శ్రీకాకుళం, నౌపడ, తిలారి, కోటబొమ్మాళి తదితర 12 స్టేషన్ల అభివృద్ధికి రూ.40 కోట్లు కేటాయించింది.
- ప్లాట్‌ఫారాల ఎత్తు పెంచేందుకు, షెల్టర్లు నిర్మించేందుకు, ట్రాక్ రీమోడలింగ్ చేసేందుకు, స్టేషన్ అభివృద్ధికి ఈ నిధులు ఖర్చు చేయనుంది.
- పూండి నుంచి ఉన్న మెయిన్ రైల్వే ట్రాక్ అభివృద్ధి పనులకు రూ.50లక్షలు, నౌపడ నుంచి గుణుపూర్ వరకు ఉన్న ప్రస్తుత రైల్వే లైన్, లెవెల్ క్రాసింగ్ తదితర మరమ్మతులకు సుమారు రూ. 50లక్షలు, జిల్లాలోని మెయిన్‌లైన్ విద్యుద్దీకరణ పనులకు రూ.3 కోట్లు, రైల్వే స్టాఫ్ క్వార్టర్స్ మరమ్మతులు, కొత్త నిర్మాణాల కోసం రూ.50 లక్షలు కేటాయించింది. తాజా బడ్జెట్‌లో ప్రస్తావించినవన్నీ గతంలో మంజూరైన వాటికి కొనసాగింపుగా ఇచ్చిన నిధులే తప్ప కొత్తగా చేసిన ప్రతిపాదనలకు చేసిన కేటాయింపులు కావు. కొత్త లైన్లు, కొత్త ట్రైన్లు, కొత్త స్టాప్ తదితర ప్రతిపాదనలకు తాజా బడ్జెట్‌లో చోటు కల్పించలేదు.

క్వారీల కంట్లో ఆంక్షల కారం

- కూటమి ప్రభుత్వం వచ్చాక మైనింగ్ పర్మిట్ల జారీకి బ్రేక్
- నిర్వహణ సైతం నిలిపివేయాలని ఆదేశాలు
- 50 రోజులుగా జిల్లాలో నడవని గ్రానైట్ క్వారీలు, అనుబంధ పరిశ్రమలు
- ఉపాధిని కోల్పోయిన గ్రానైట్ ఆధారిత కార్మికులు
- గుత్తాధిపత్యం కోసం ఓ నేత వ్యూహాత్మక కుట్రగా అనుమానాలు!



గ్రానైట్ క్వారీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

క్వారీలపై ఓ నేత అనుసరిస్తున్న వ్యూహాత్మక కుట్ర కార్మికుల పాలిట శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తీసుకొచ్చిన నూతన గ్రానైట్ పాలసీ విధానం గ్రానైట్ క్వారీలు, వాటి అనుబంధ పరిశ్రమలకు భారీగా షాక్ ఇచ్చింది. సుమారు 50 రోజులుగా గ్రానైట్ క్వారీల పర్మిట్లు, క్వారీల నిర్వహణ నిలిపివేయడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికులు ఆకలి కేకలతో రోడ్డున పడే పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గ్రానైట్ పరిశ్రమలతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకోవడానికో, ముడుపుల బేరసారాలు చేసేందుకో.. కొన్ని రోజులు ఆంక్షలు పెడితే వారే దారికొస్తారనో.. తెలియదు గానీ గ్రానైట్ పాలసీ పేరుతో వ్యూహాత్మక కుట్ర జరిగింది. వీరి నిర్వాకంతో ఏకంగా గ్రానైట్ పరిశ్రమ స్తంభించిపోయింది. వాటిపై ఆధారపడ్డ కార్మికులంతా ఉపాధిని కోల్పోయి పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్వారీ పర్మిట్ల అనుమతుల విషయంలో తొలుత మైనింగ్ డిపార్ట్‌మెంట్ నేరుగా ఇచ్చేది. ఆ తర్వాత మరింత సౌలభ్యంగా ఉండేలా ప్రైవేట్ ఏజెన్సీకు బాధ్యతలు అప్పగించడంతో, ఏ సమయంలోనైనా పర్మిట్లు తీసుకునే వెసులుబాటు ఉండేది. దీనివల్ల ప్రభుత్వానికి స్పష్టమైన ఆదాయం రావడంతో అక్రమ కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక నిఘాతో నడిచేది. ఇంతలో ప్రభుత్వం మారి కూటమి పాలన రావడంతో వారి దృష్టి గ్రానైట్ పరిశ్రమలపై పడింది.

గుత్తాధిపత్యం కోల్పోవడంతో..

వాస్తవంగా కొన్నేళ్లుగా ప్రస్తుత పాలక పక్షంలో ఉన్న ఓ నేత కనుసన్నల్లోనే గ్రానైట్ కార్యకలాపాలు జరిగేవి. ఆ నేత ఎవరనేది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. 2014-19లో ఆ నేతకు బిగ్‌బాస్ అనే పేరు కూడా ఉండేది. గ్రానైట్ కార్యకలాపాలు తన కనుసన్నల్లో జరిగేలా శాసించారు. వ్యక్తిగతంగా వారి కుటుంబానికి గ్రానైట్ అనుబంధ పరిశ్రమ ఉంది. దానిని ఆధారంగా చేసుకుని ఏకంగా గ్రానైట్ పరిశ్రమపైనే గుత్తాధిపత్యం చెలాయించేవారు. కంపెనీల నుంచి నెలవారీ ముడుపులు తీసుకోవడం, తన అనుబంధ పరిశ్రమకు ఆయా గ్రానైట్ కంపెనీల వ్యర్థ మెటీరియల్‌ను సరఫరా చేయించుకోవడం జరిగేది. కానీ, 2019-24లో తన ఆధిపత్యానికి బ్రేక్ పడింది. పెత్తనం చెలాయించడానికి కుదరలేదు. అప్పుడప్పుడు అక్రమ లావాదేవీలు చేసి దొరికిపోవడం తప్ప చక్రం తిప్పడానికి అవకాశం లేకుండా పోయింది.

కూటమి రాకతో పర్మిట్లకు బ్రేక్..

మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో సహజంగానే ఆ నేత దృష్టి తనకు అలవాటైన గ్రానైట్ కార్యకలాపాలపై పడింది. తన గుప్పెట్లో తెచ్చుకోవాలనో.. మరేమి ఆశించారో తెలియదు గానీ పరోక్షంగా ప్రభుత్వ స్థాయిలో చక్రం తిప్పి గ్రానైట్ కార్యకలాపాలపై ఆంక్షలు అమల్లోకి తెచ్చారు. నూతన పాలసీ విధానం పేరుతో ఆంక్షలు విధించడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 200 పైచిలుకు గ్రానైట్ క్వారీల్లో పనులు నిలిచిపోయాయి. క్వారీలకు పర్మిట్లు ఇవ్వకుండా నిలిపేశారు. ఆ క్వారీల నిర్వహణ కూడా జరగకూడదని హుకుం జారీ చేశారు. దీంతో గ్రానైట్ క్వారీలతో పాటు వాటి అనుబంధ గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు, క్రషర్లు నిర్వహణపై ప్రభావం పడింది. అవన్నీ ఆగిపోవడంతో వాటిలో పనిచేసే కార్మికులు, కూలీలు ఒక్కసారిగా ఉపాధి కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు విధించడంపై క్వారీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాకపోతే, ఆ నేతకు భయపడి ఏమీ మాట్లాడలేకపోతున్నారు. గమ్మున ఉండిపోయి, కార్యకలాపాలు ఆగిపోయిన క్వారీలు, అనుబంధ పరిశ్రమలను చూసి బాధపడుతున్నారు.



50 రోజులుగా పస్తులు..

గ్రానైట్ క్వారీలో వైర్సా ఆపరేటర్లు, కంపర్షర్ ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, సైట్ ఇన్‌చార్జిలు, జాకీ కార్మికులు, ప్రొక్లెయిన్ ఆపరేటర్లు, ట్రిప్పర్, చిన్నపాటి వాహనాల డ్రైవర్లతో పాటు ప్రతీ క్వారీకు అనుసంధానంగా మెస్ నిర్వహించే కార్మికులు.. ఇలా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు ఉన్నారు. వీరంతా సుమారు 50 రోజుల నుంచి పస్తులుండే దుస్థితి దాపురించింది. ఒడిశా, తమిళనాడు, రాజస్థాన్ ప్రాంతాల నుంచి ఇక్కడకు క్వారీ పనుల కోసం వచ్చిన టెక్నీషియన్స్ తిరుగుముఖం పడుతున్నారు. వారిని మళ్లీ తీసుకురావాలంటే తలకు మించిన భారమని క్వారీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల ఆకలి కేకలు పట్టవా...




జిల్లాలో నిరుద్యోగ యువతతో పాటు మరి కొందరు కార్మికులకు గ్రానైట్ రంగం ఎన్నో ఉపాధి అవకాశాలకు మార్గం. ఇటువంటి గ్రానైట్ రంగంపై నూతన పాలసీ విధానం పేరుతో సుమారు 50 రోజులుగా పర్మిట్లు ఇవ్వడం లేదు. మరో వైపు క్వారీల నిర్వాహణ నిలిపివేశారు. దీంతో జిల్లాలో వేలాది మంది కార్మికులు నడిరోడ్డున పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పర్మిట్లు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి.

– ఎస్.షణ్ముఖరావు, గ్రానైట్ కార్మికుల అసోసియేషన్ ప్రతినిధి, టెక్కలి

దివ్యాంగుల అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 3న జరగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు, దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు జాతీయ స్థాయి అవార్డు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఏడీ కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఈ అవార్డులు అందజేయనుందని, ఈ నెల 31లోగా www.awards.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అయ్యో.. రొయ్య!



వజ్రపుకొత్తూరు:

ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రొయ్యలు, చేపలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. సరిగ్గా మేత తినలేక చనిపోతున్నాయి. జిల్లాలో సుమారు 4050 ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. ఇందులో ఒక్క నౌపడలోనే దాదాపు 1000 ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. మరో 500 ఎకరాల్లో చేపల పెంపకం చేపడుతున్నారు. రొయ్యలకు వైట్‌గట్, వైట్‌మజిల్, వైరస్‌ల వంటి తెగుళ్లు కారణంగా కౌంట్ రాకముందే పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని, ఏమాత్రం తేడా వచ్చినా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మరోవైపు తరచూ విద్యుత్ కోతలతో ఏరియేటర్లు తిరగకపోవడంతో ఆక్సిజన్ అందక రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో తెగుళ్లు
- కరెంటు కోతలతో తిరగని ఏరియేటర్లు
- పతనమైన '100 కౌంట్' రొయ్యల ధరలు
- చేపల చెరువుల్లోనూ ఇదే పరిస్థితి
- ఆందోళనలో ఆక్వా రైతులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న మత్స్యశాఖ అధికారులు



కౌంట్ తగ్గిన రొయ్యిలు

చేపలు మృత్యువాత..



జిల్లాలో మహేంద్ర తనయ, బెండి గెడ్డ వాగు, వంశధార, నాగావళి నదులు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో నీటి మట్టాలు పెరిగితే చేపల చెరువు గట్లు కొట్టుకుపోయే అవకాశం ఉంది. చెరువులు నిండు కుండల్లా ఉండటంతో ఆక్సిజన్ సమస్య ఏర్పడి చేపలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. రాత్రి, తెల్లవారుజాము, ఉదయం సమయాల్లో చేపలు చనిపోతున్నాయి. చెరువులో నీరు ఆకుపచ్చరంగుకు మారి పులిసిన వాసన వస్తుంది. కొన్నిచోట్ల చేపలు నలుపు వర్ణం కోల్పోయి తెల్లబడటం, శరీరం మెత్తబడటం వంటి లక్షణాలతో చనిపోతున్నాయి. చేపల మొప్పలు ఎరుపు, తరువాత లేత గులాబి రంగుకు మారుతున్నాయి.

చేపల చెరువులు- జాగ్రత్తలు



- చేపల చెరువుల్లో మేతగా సేంద్రియ ఎరువులు మానేయాలి
- చనిపోయిన చేపలను చెరువు నుంచి తొలగించాలి.
- కాల్షియం పెరాక్సైడ్ ఎకరాకు 1 నుంచి 2 కిలోలు, హైడ్రోజన్ పెరాక్సైడ్ 2 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి.
- ఉదయం సమయంలో కార్బన్ డయాక్సైడ్‌సాంద్రతను తగ్గించడానికి సున్నం ఎకరాకు 20-25 కిలోలు చల్లాలి.
- ఆక్సిజన్ లోటు నుంచి కోలుకున్న చేపలకు ప్రతి టన్ను మేతకు 10-15 కిలోల మినరల్ మిక్సర్ వరుసగా 15-20 రోజుల పాటు అందిచాలి.
- నీటిలో అమ్మోనియా ఉంటే చెరువులో కొంత నీటిని తొలగించి అడుగు భాగం శుభ్రం చేసుకుని మళ్లీ నీటిని పెట్టుకోవాలి.


రొయ్యల చెరువులు- జాగ్రత్తలు



ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్యల రైతులు పలు జాగ్రత్తలు పాటిస్తే నష్టాల బారి నుంచి తప్పించుకోవచ్చని మత్స్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.


- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిత్యం ఏరియేటర్లు తిప్పాలి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఏరియేటర్లు వినియోగించేందుకు జనరేటర్లు, ఇంజన్లను సిద్ధం చేసుకోవాలి.
- రొయ్యల్లో ఆక్సిజన్ కొరత నివారణకు పొటాషియం పర్మాంగనేట్ పొడిని సిద్ధంగా ఉంచుకుని అవసరమైన మేరకు చెరువుల్లో చల్లాలి. వర్షం కారణంగా చెరువుల్లో నీటి మట్టం మరీ పెరగకుండా 50 సెంటీమీటర్లు లోతు వరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నందున రొయ్య లు మేత సక్రమంగా తినవు. అవసరం మేరకు మాత్రమే మేత వేసి ఖర్చు తగ్గించుకోవాలి.
- చెరువు గట్లు పల్లంగా ఉన్న చోట గండ్లు పడకుండా పటిష్టం చేసుకోవాలి. గట్లు ఎత్తు తక్కువ ఉన్న చెరువుల్లో రొయ్యలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసుకోవాలి.

తెగుళ్లు సోకుతున్నాయి..



రెండు వారాలుగా వర్షాలు కురవడంతో రొయ్యలకు వైట్‌గట్, వైరస్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. దీంతో మేత సక్రమంగా తినకపోవడమే కాక, తెగుళ్ల కారణంగా రొయ్యలు చనిపోతున్నాయి. దీనికి ఆక్సిజన్ కొరత కూడా కారణం. ఏరియేటర్లు వాడుతున్నా ఉష్ణోగ్రతల్లో తేడాలు ఉండటం వల్ల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ కౌంట్‌కు రొయ్యలను పట్టడం వల్ల తక్కువ ధరలకు అమ్ముడవుతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. – పి.రవికుమార్ రెడ్డి, ఆక్వా రైతు, నౌపడ

ముందస్తు చర్యలు తప్పనిసరి..



రొయ్యలు, చేపల చెరువుల వద్ద జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలను తగ్గించవచ్చు. ఆక్సిజన్ కొరత కారణంగా రొయ్యలకు ఇబ్బంది ఏర్పడుతుంది. నిత్యం ఏరియేటర్లు తిరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం మేరకే మేత వేయాలి.

– ధర్మరాజు పాత్రో, ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ, పలాస



సీతానగరం ప్రాంతంలో చెరువులో ఆక్సిజన్ కోసం తిప్పుతున్న ఏరియేటర్లు

జిల్లాలో ఆక్వా రైతులు సంఖ్య	658	సాగు చేసే చెరువుల విస్తీర్ణం	1620 హెక్టార్లు
ప్రైవేటు హేచరీలు	3	ఏడాదికి ఎగుమతి చేసే రొయ్యలు	19440 మెట్రిక్ టన్నులు

ప్రస్తుతం రొయ్యల ధరలు ఇలా..

కౌంట్	100	90	80	70	60	50	40	30
కిలో (రూ.లలో)	210	230	240	260	280	300	340	440

క్లుప్తంగా

రూ.4,16,514 ఆర్థికసాయం



కార్మికుడి కుటుంబానికి సాయం అందిస్తున్న తోటి కార్మికులు, నాయకులు

రణస్థలం: మండలంలోని వరిసాం వద్ద శ్యాం పిస్టన్స్ పరిశ్రమలో పనిచేస్తూ కార్మికుడు పంచి రెడ్డి దుర్గాప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా ఉండేందుకు తోటి కార్మికులంతా ఒక రోజు వేతనం రూ.4,16,514 సేకరించారు. ఆ మొత్తాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, శ్యాంక్రాగ్ పిస్టన్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్ చేతుల మీదుగా అతని కుటుంబానికి పరిశ్రమ వద్ద బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్ భార్య పి.పావని, యూనియన్ నాయకులు ఎం.కూర్మారావు, ఎస్.నాగేశ్వరరావు, జయరాం, జి.ఈశ్వరరావు, రామారావు, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్ కేటాయింపులతో రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: బంగారంపై సెస్ పన్ను తగ్గించి చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాన్ని ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. భారత్ సంకల్ప బడ్జెట్ - 2024కు సంబంధించి బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాకుళంలో బుధవారం 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ వర్గాలకు చెందిన మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. నరేంద్ర మోదీ సారథ్యంలో 2024 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, చార్టర్డ్ అకౌంటెంట్ ఐ.కె.రావు, సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, వ్యాపారవేత్త పొట్నూరు శ్రీనివాసరావు, గోల్డ్ మర్చెంట్ సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల సాంబమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ నటుకుల మోహన్, శ్రీకాకుళం మార్కెట్ అధ్యక్షుడు కోరాడ హరగోపాల్, సివిల్ ఇంజనీర్ పొట్నూరు రమేష్‌చక్రవర్తి, ఆడిటర్ తమ్మాన వెంకట నరసింహమూర్తి, జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ శ్రీకాకుళం గ్రీన్‌సిటీ ప్రెసిడెంట్ వరలక్ష్మి, జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షురాలు మణిశర్మ, ఎస్.ఎస్.జ్యువలరీ అధినేత ఎన్.శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జీ, కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి, జాతీయ కౌన్సిల్ సభ్యులు చల్లా వేంకటేశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరాడ అప్పలరాజు, భవన నిర్మాణ కార్మికుల సెల్ జిల్లా కన్వీనర్ గురుగుబెల్లి రాజు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువైన సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

కాశీబుగ్గ: రైల్వే ప్రయాణికుల నుంచి చోరీకి గురైన సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకుని తిరిగి బాధితులకు అందజేసినట్లు పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ బుధవారం తెలిపారు. మొత్తం ఆరు మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పలాస జీఆర్‌పీ క్రైమ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ పి.కోదండరావు, కానిస్టేబుళ్లు ఎం.సంతోష్‌కుమార్, పి.రమేష్‌బాబు, జె.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌పై నీలినీడలు!



- నమోదు కోసం ఎదురుచూస్తున్న రైతులు
- స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1.68 లక్షల హెక్టార్లు

హిరమండలం :

అన్నదాతలకు అండగా నిలిచే ఈ-క్రాప్ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికే రైతుభరోసా పథకం కింద పంట సాయం అందక ఆందోళన చెందుతున్న రైతులకు.. ఈ-క్రాప్ నమోదుపైనా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆగ్రహం కలిగిస్తోంది. గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, ఈ-క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు విజయవంతంగా అమలు చేసింది. ఈసారి అమలవుతాయో లేదోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో 1,53,785 హెక్టార్లలో సాగుచేయగా 1,43,837 హెక్టార్ల మేర పంటలకు ఈ-క్రాప్ నమోదు చేశారు. రబీలో 53,005 హెక్టార్లలో సాగుచేయగా 49724 హెక్టార్లకు ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,68,662 హెక్టార్లలో పంట సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయగా ఇప్పటికి 88,552 హెక్టార్లలో పంటలు సాగుచేస్తున్నారు.

పొలం పనుల్లో బిజీ..

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగుకు ఉపక్రమించారు. అదును చూసుకుని విత్తనాలు చల్లుతున్నారు. కొందరు ఇప్పటికే వెద పద్ధతిలో వరి విత్తనాలు చల్లారు. ఏటా పంటల సాగు సమయంలో పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బంది ఇప్పుడు కనిపించకపోవడంతో కలవరపడుతున్నారు. ముఖ్యంగా ఈ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో ఇబ్బందులు తప్పవని బెంగపడుతున్నారు. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని ఆరా తీస్తున్నా సరైన సమాధానం లేక దిగులు చెందుతున్నారు. పంటల సాగుకు ఎరువులు కొనాలన్నా, పంటలు విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు పంటబీమా పొందాలన్నా ఈ-క్రాప్ తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యమున్న పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి భరోసా అందేది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం అందక ఆవేదన చెందుతున్నారు.



గత ప్రభుత్వంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

ఆదేశాలు రాలేదు..



ఖరీఫ్ సీజన్‌కు ఈ-క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఆదేశాలు అందలేదు. వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. త్వరలో ప్రభుత్వం ప్రకటించే నిర్ణయం ప్రకారం రైతులకు మేలు చేసేలా వ్యవసాయాధికారులు, సిబ్బంది తోడ్పాటు అందిస్తాం.

– కె.శ్రీధర్, జేడీఏ, శ్రీకాకుళం

కొనసాగించాలి..



ఈ-క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-క్రాప్ చేయకపోతే పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. వెంటనే ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని కొనసాగిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– వై.రాజారావు, రైతు, తంప, హిరమండలం

గతంలో ఇలా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసేది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ-క్రాప్ ప్రక్రియ ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ ప్రక్రియను నిర్వహించేవారు. పంటలు సాగుచేసిన రైతులను పొలం వద్ద ఉంచి ఫొటోలు, వివరాలు యాప్‌లో నమోదు చేసేవారు. ఇవన్నీ ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రంలో నిక్షిప్తమయ్యేవి. ఈ-క్రాఫ్ ఆధారంగానే ఎరువులు, పురుగుమందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించేవి. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతులు సాగు పట్ల ధీమాగా ఉండేవారు. పండితే పంట, లేకుంటే బీమా వస్తుండేది. ఈ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం పంట కొనుగోలు చేసేది. భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేది. రైతులు పంట ఉత్పత్తులను తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరలకు విక్రయించే అవకాశం లభించేది. రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు చేసే ప్రతి ఉత్పత్తికి రసీదులు అందజేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు పారదర్శకత పాటించేవారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రాజశేఖరరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: భయంకరమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తమ తండ్రిని ఆదుకోవాలని కోరుతూ 'మా నాన్నను బతికించండి' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. బాధితుడు పతాన రోహిణీ కుమార్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, తేలుకుంచి సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి రూ.5వేలు, పశువైద్యాధికారి డాక్టర్ మంజుల నారాయణరావు రూ.రెండు వేలు, రమేష్ వెయ్యి రూపాయలను బుధవారం అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి తండ్రి వైద్యానికి ఆర్థిక సాయం చేయాలని చిన్నారులు కోరుతున్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి : మండలంలోని దారిపేటలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు బుధవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సారా వల్ల కలిగే నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్, టెక్కలి ఎస్ఈబీ ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద గందరగోళం



టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అడ్డంగా పెట్టిన ట్రాక్టర్లను పక్కకు మళ్లిస్తున్న పోలీసులు

టెక్కలి/కొత్తూరు: టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద బుధవారం ట్రాక్టర్ యజమానుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని గందరగోళానికి దారితీసింది. ఆర్టీసీ డిపో వద్ద స్టాక్ పాయింట్ నుంచి ఇసుక కొనుగోలు కోసం కిలోమీటర్ల మేర ట్రాక్టర్లు ప్రతి రోజూ క్యూ కడుతున్నాయి. అయితే బుధవారం కొందరు డ్రైవర్లు అడ్డదారిలో వాహనాలు పెట్టడంతో, ఇసుక కోసం రోజులు తరబడి నిరీక్షించిన మిగిలిన డ్రైవర్లు ఒక్కసారిగా మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు స్టాక్ పాయింట్ వద్దకు చేరుకుని అడ్డంగా ఉన్న ట్రాక్టర్లను పక్కకు మళ్లించారు. అయితే నిన్నటి వరకు ఒకే వరుసలో ఉన్న ట్రాక్టర్లు ప్రస్తుతం రెండు వరుసలుగా ఏర్పడటంతో పాత జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

12 టైర్ల లారీలకు అనుమతి..

కొత్తూరు మండలం అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ నుంచి లోడింగ్ చేసేందుకు 6, 8, 10, 12 టైర్ల లారీలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు తహసీల్దార్ ఎం.వి.ప్రసాదరావు బుధవారం తెలిపారు. ఇంత వరకు ట్రాక్టర్లతో పాటు ఆరు టైర్ల లారీలకు మాత్రమే ఇసుక లోడ్ చేసేందుకు అనుమతులు ఉన్నట్లు చెప్పారు.

అంతర్‌జిల్లా టోర్నీలో అదరహో



నంబళ్ల సుశాంత్



పూర్ణచంద్ర



జున్నారావు



సిద్దు విగ్నేష్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెట్ క్రీడాకారులు ఈ సీజన్‌లో అద్భుతమైన ఆటతీరుతో రాణిస్తున్నారు. జిల్లా జట్టును విజయపథంలో నిలుపుతున్నారు. స్టార్ ఓపెనర్ నంబళ్ల సుశాంత్ తన ఫామ్‌ను కొనసాగిస్తున్నారు. ఈ యువ ఆటగాడు 127 పరుగుల అజేయ సెంచరీతో మరోసారి ఆకట్టుకోగా, మరో లెఫ్టార్మ్ స్పిన్నర్, ఆల్‌రౌండర్ మొదలవలస పూర్ణచంద్ర 5 వికెట్లతో విజృంభించగా, సిద్దూ విగ్నేష్ 58 పరుగులు, జున్నారావు మూడు కీలక వికెట్లను పడగొట్టి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించారు. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్ఎం కళాశాల క్రికెట్ మైదానం వేదికగా మొదలైన ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-19 పురుషుల త్రీడేస్ మ్యాచ్‌లో జిల్లా జట్టు పటిష్టస్థితిలో నిలిచింది. బుధవారం నెల్లూరుతో మొదలైన మూడు రోజుల టెస్టు మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. జిల్లా జట్టు బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ ఎం.పూర్ణచంద్రరావు అద్భుత స్పిన్ మాయాజాలాన్ని ప్రదర్శించాడు. 6 ఓవర్లు బౌలింగ్ చేసి ఇందులో 2 ఓవర్లు మెయిడిన్ వేసి కేవలం 10 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. మీడియం పేసర్ జున్నారావు మూడు కీలక వికెట్లను పడగొట్టాడు.

సుశాంత్ అజేయ సెంచరీతో..

అనంతరం తన మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు స్టార్ ఓపెనర్ ఎస్.సుశాంత్ అజేయ సెంచరీతో మొదటి రోజు ఆటముగిసే సమయానికి 59 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 262 పరుగులు చేసింది. సుశాంత్ 180 బంతుల్లో 26 బౌండ్రీల సహాయంతో 127 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వన్‌డౌన్ బ్యాటర్ పుల్ల సిద్దు విగ్నేష్ 58 (11బౌండ్రీలు)పరుగులతో ఆకట్టుకున్నాడు.

బ్యాంగిల్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ. 9.50 లక్షల ఆస్తి నష్టం



వాటర్‌ప్రెజర్‌తో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న పరమేశ్వరి ఫ్యాన్సీ బ్యాంగిల్ షాపులో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.9.50 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. ఏడీఎఫ్‌వో వరప్రసాదరావు చెప్పిన వివరాల మేరకు.. షాపులో మధ్యాహ్నం 1.05 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు చెలరేగాయి. వెంటనే సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో వన్‌గ్రామ్ గోల్డ్, బ్యాంగిల్స్, ఇన్వెర్టర్, ఫ్యాన్లు, రూ.30 వేల నగదు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది షణ్ముఖరావు, శృంగారనాయుడు, కూర్మారావు, నారాయణరావు, రామస్వామి, సతీష్‌బాబు, కోటేశ్వరరావు, కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వాటర్‌ప్రెజర్, ఫోమ్‌తో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.

104 ఉద్యోగులపై కక్షసాధింపు తగదు



డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న యూనియన్ నాయకులు

అరసవల్లి: జిల్లాలో 104 ఉద్యోగులపై కక్షసాధింపు ధోరణి వీడాలని 104 జిల్లా యూనియన్ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద 104 వాహన డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. యూనియన్ సభ్యుడు డి.కిరణ్‌ను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని, ఇదే విషయమై వివరణ ఇచ్చినా కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఉద్యోగాల తొలగింపు చర్యలు రానున్న రోజుల్లో ఒక్కరితో ఆగదని.. దీనిపై సంయుక్త కార్యాచరణతో సీఐటీయూ నాయకులు సురేష్‌బాబు, తదితరుల ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 104 యూనియన్ ప్రతినిధులు సీహెచ్ నారాయణరావు, ఎస్.నరేంద్ర, బాలకృష్ణ, ధనలక్ష్మి, కూర్మారావు, ఈశ్వరరావు, షన్ముఖరావు, రమేష్, మహేష్, వాసుదేవరావు, హరి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల తీరుపై దర్యాప్తు



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి విలియమ్, జీసీడీఓ నీరజ

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ తరగతులకు చెందిన అధ్యాపకుల చెడు ప్రవర్తనపై టెక్కలి డిప్యూటీ ఈఓ పి.విలియమ్, జీసీడీఓ నీరజలు బుధవారం దర్యాప్తు చేపట్టారు. విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గతేడాది ఏప్రిల్‌లో ఇంటర్ విద్యార్థిని పట్ల అధ్యాపకులు అసభ్యకరంగా ప్రవర్తించారంటూ విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అప్పట్లో గోప్యంగా ఉంచారు. అప్పటి ఫిర్యాదుపై టెక్కలి ఉప విద్యాశాఖాధికారి విలియమ్, జీసీడీఓ నీరజలు బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విలియమ్ మాట్లాడుతూ ఉర్లాంలో ఇంటర్ ప్లస్ చదువుతున్న ఓ విద్యార్థినిపై అదే చోట టీచింగ్ చేస్తున్న ఒక అధ్యాపకుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు, ఈయనకు తోటి టీచర్లు వంత పాడుతున్నట్లు విద్యార్థులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వివరాలు సేకరించామని, నివేదికను డీఈఓకు అందిస్తామని చెప్పారు.

26న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ హస్పటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ శిక్షణా సంస్థలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో రూరల్ బ్యాంకు మిత్ర పోస్టులకు, ఎం/ఎస్ ఆటోమోటివ్ మ్యానిఫ్యాక్టురెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మెకానిక్స్, హెల్పర్స్ పోస్టులకు, 2050 హెల్త్ కేర్ సంస్థలో బీసీజీ (బెడ్ సైడ్ కేర్ గివేర్) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన స్త్రీ/పురుషులు అర్హులని పేర్కొన్నారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులు, ఐటీఐ డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, జీడీఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎం, జీఎన్ఎం అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

అధికారులపై దాడి కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కాశీబుగ్గ: అధికారులపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులకు పలాస జూనియర్ సివిల్ కోర్టు ఆరు నెలల జైలు శిక్ష, ఐదు వందల రూపాయలు జరిమానా విధించినట్లు కాశీబుగ్గ సీఐ ఎస్‌హెచ్ విజయ ఆనంద్ తెలిపారు. పలాస మండలం రేగులపాడులో నిర్మిస్తున్న మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులకు పునరావాసకాలనీ నిర్మించడానికి 50 ఎకరాలు స్థలాన్ని టెక్కలిపట్నం పరిసర ప్రాంతంలో కేటాయించారు. సన్న, చిన్నకారు రైతులు ఉన్నారని, భూసేకరణ 20 ఎకరాలకు తగ్గించేందుకు 2017లో వీఆర్‌ఓ, సర్వేయర్ పరిశీలన నిమిత్తం భూమి వద్దకు వెళ్లగా టెక్కలిపట్నం, కొమలాపురం గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. అక్కడితో ఆగకుండా దాడి చేశారు. ఈ ఘటనపై అప్పటి తహశీల్దారు కల్యాణ చక్రవర్తి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏపీపీ పి.రమేష్ వాదనతో పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి విచారణ చేసి టెక్కలిపట్నంకు చెందిన కరకవలస నందకుమార్, జోగ పార్వతి, కొమలాపురం గ్రామానికి చెందిన మడ్డు రంగారావులకు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

అధికార భాష అమలుపై చర్చ



సమావేశంలో పాల్గొన్న కార్యాలయాల అధిపతులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో భారత ప్రభుత్వ హోంమంత్రిత్వశాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికార బాష అమలుకు సంబంధించి అర్ధ-వార్షిక సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, అండర్‌టేకింగ్స్, ఇన్స్రూ కంపెనీలు, జాతీయ బ్యాంక్‌ల కార్యాలయ అధిపతులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ అధికార బాషా విధానం అమలుపై చర్చించారు. అనంతరం అధికార భాష అమలులో అత్యుత్తమ పనితీరు కనబరిచన సభ్య కార్యాలయాలకు రాజ్ భాషా షీల్డ్‌లు ప్రదానం చేశారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఎం.తిలక్, బెంగళూరు ఆర్‌ఐవో డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిస్వాస్, ఇన్‌కంటాక్స్ అధికారి కె.రవిశంకర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఏఏ హసీబ్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ హెడ్ నవీన్ నేగీ, టోలిక్ సభ్య కార్యదర్శి బిజయ్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వీడని ముంపు..పొలాలకు ముప్పు



ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల సరుబుజ్జిలి మండలం వ్యాసులపేట, తురకపేట, ఎంఎస్‌పురం, వీరభద్రాపురం తదితర గ్రామాల్లో పంటపొలాలు ఇంకా వరద నీటిలో మునిగి ఉన్నాయి. నీరు తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

– సరుబుజ్జిలి

సీతాఫలం.. దిగుబడి ఘనం

గిరిజన ప్రాంతాలతో పాటు ఉద్దానంలో ఈ ఏడాది సీతాఫలం చెట్లు విరగకాశాయి. హరిపురం, రట్టి, రంగోయి, నీలావతి, మాకన్నపల్లి, బొడ్డపాడు, అక్కుపల్లి, గరుడుబద్ర, రెయ్యిపాడు, అమలపాడు, అల్లాడ, పూండి, మురహరిపురం తదితర గ్రామాల నుంచి కావళ్లతో సీతాఫలాలను తీసుకొచ్చి కాశీబుగ్గ మార్కెట్లో పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు.

– కాశీబుగ్గ



హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ



ద్విచక్రవాహనం నడిపే ప్రతి వ్యక్తి కచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందేనని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్.తేజచక్రవర్తి మల్ల స్పష్టం చేశారు. ఈ మేరకు టెక్కలి జగతిమెట్ట జంక్షన్, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

–టెక్కలి